ప్రజాశక్తి

గురువారం 5 జూన్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, షేక్ రియాజ్

ఏడాది పాలనపై 'కూటమి' సంబరాలు

2లో



దర్శిలో ర్యాలీలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

5లో

పోలీసులు పాలకపక్షమే..!

- ఏ పార్టీ అధికారంలో ఉన్నా జరిగేది ఇదే..
- రక్షకభటులను వాడుకుంటున్న ప్రధాన రాజకీయపార్టీలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'పోలీసులు ప్రభుత్వానికి తొత్తు లుగా ఉన్నారు.. పాలకపక్షానికి అను కూలంగా ఉన్నారు..' అంటూ ప్రతిపక్షం గగ్గోలు పెడుతోంది. ఇది సహజమే. అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ పోలీసులు పాలకపక్షానికి అనుకూలంగానే ఉంటారు. ఏ పార్టీ అధికారం లో ఉంటే వారికి అనుకూలంగా ఉండటం సహజం. గత ఐదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన వైసిపి హయాంలో ఆ పార్టీ నేతలు చెప్పినట్లు విన్నారు. కాదనలేం. ఇప్పుడు తెలుగుదేశం అధికారంలో ఉన్నందున ఇప్పుడు వీరి మాట ప్రకారం వెలు తున్నారు. ఇది సర్వ సాధారణమైంది.

ఇప్పుడు పోలీసుల తీరుపై ఎందుకు చర్చ వచ్చిందంటే తెనాలి, కొండపి నియోజక వర్గం, జాళ్లపాలెంలో పోలీసుల తీరు చర్చ నీయాంశమైంది. అక్కడ నిందితులంటూ ముగ్గురు యువకులను రోడ్డుపై కూర్చొబెట్టి అరికాళ్లపై కొట్టారు. జాళ్లపాలెంలో ఎస్‌ఐ సీసీపుటేజ్ కోసం ఓ ఇంటికి వెళ్లిన తీరు చట్టబద్ధతపై చర్చ సాగేలా చేశాయి. ఎవరు ఎంత తప్పుచేసినా చట్టానికి లోబడే వ్యవస్థలు పనిచేయాల్సి ఉంది. అందులో పోలీసు వ్యవస్థ అతీతం కాదు. పోలీసు చర్యలు చట్టబద్ధంగా ఉండాలంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఇతర సంబంధిత చట్టాలకు అనుగుణంగా ఉండాలి. నిందితులను బహిరంగంగా శిక్షించడం, లాఠీఛార్జి చేయడం వంటివి చట్టవిరుద్ధం. ఇవి మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించబడ తాయి. అయితే పాలకులు ఎవరైతే అధికారం లో ఉంటారో వాళ్లు అప్పుడు అన్నీ మరిచి పోతారు. ప్రతిపక్షంలోకి వచ్చాక.. పోలీసులు ఎలా పనిచేస్తున్నారో చెబుతారు. జాళ్లపాలెం లో ఎస్‌ఐ చట్టప్రకారం పోయారా? లేదా? అనేదాని కన్నా అక్కడ సామాజిక అంశం తెరపైకి తెచ్చారు. తెనాలిలో నిందితులు దళితులైనా, ఎవరైనా ఒకటేనన్న మంత్రులు.. అదే ఎస్‌ఐ విషయంలో మాట మార్చారు. దళిత ఎస్‌ఐ అనే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఇక్కడ ఎస్‌ఐ కులం అప్రస్తుతమైనా తెరపైకి మంత్రులే తేవడం గమనార్హం. ఇవన్నీ చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే.. మరో వైపు అనివార్యంగా ఎస్పీ దామోదర్ కూడా ప్రభుత్వానికి అనుకూలంగానే వ్యవహరించాల్సి ఉన్నందున ఎస్‌ఐ విధులను ఆటంకపరచడం నేరమన్నారు. అందుకు వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. జరుగుతున్న పరిణామాలన్నీ రాజకీయ రంగు పులుముకున్నాయి. ప్రధాన రాజకీయపార్టీలు పోలీసులను ఎలా వాడుకుం టున్నాయో ఆలోచించాలి. పోలీసు వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేశారు? ఎవరి ప్రయోజ నాల కోసం అనేదీ చరిత్రపుటల్లోకి వెళ్లి పరిశీలన చేయాలి. ప్రజల గొంతునొక్కడానికి కాదా? ప్రజాఉద్యమాలు జరిగితే వాటిని అణచివేయడానికి కాదా? అనేక సంఘటనలు చరిత్ర పుటల్లో ఉన్నాయి. పాలకులు ఎవరైనా తమ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలను ఎదిరించే వర్గాలనూ ఇదే విధంగా అణచి వేశాయి. నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెట్టిం చాయి. ప్రత్యేక హోదా, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమించిన ▶ 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

అనాథ శిశువుల దత్తత ప్రక్రియ

చట్టబద్ధంగా నిర్వహించాలి..

కలెక్టర్ వెంకటమురళి

8లో

రోడ్డున పడ్డ పేదలు..

- 20 ఏళ్లుగా నివాసముంటున్న ఇళ్లు కూల్చివేత
- ఓ విఆర్‌ఓతో కలిసి గృహాలు పడగొట్టించిన అధికార పార్టీ నేత
- రెండు నెలలుగా పేదలు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం..
- రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు
- తాము కొనుగోలు చేశామంటున్న టిడిపి నేత




బాధితుల ఆందోళన



ఇళ్లు కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాశక్తి-కనిగిరి

కూలీనాలీ చేసుకొనే బతికే పేదలు 20 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో గహాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇన్నేళ్లుగా అటు వైపు ఎవరూ రాలేదు. రెండు నెలల క్రితం ఓ అధికార పార్టీ నేత ఓ విఆర్‌ఓను వెంటబెట్టుకొని అక్కడికి వచ్చారు. ఈ భూమి తాము కొనుగోలు చేశామని చెప్పారు. ఇది ప్రభుత్వ భూమి అని పేదలు చెప్పినా విని పించుకోలేదు. పేదలు నివాసముంటున్న పది ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూల్చేయించారు. దీంతో పేదలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమకు న్యాయం చేయాలని రెండు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోలేదు. కనిగిరి ▶ 2లో



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
భూమి రికార్డుల వివరములు
పట్టాదారుని అడంగలు

District : ప్రకాశం-Prakasam (8) Mandal : కనిగిరి (31) Village : హాజీస్ పురం(831017)

వరుస సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణం	సాగుకు పనికి రాని విస్తీర్ణం	సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం	భూమి స్వభావం	శిస్తు (రూ.)	భూమి వివరణ	జలాధారము	ఆయకట్టు విస్తీర్ణం	ఖాతా నెంబరు / ఆధార్ నెంబరు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	539	7.5200	0.0000	7.5200	ప్రభుత్వ భూమి	0.00	మెట్ట	లేదు	0.0000	90024

రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు..

రోడ్డున పడ్డ పేదలు

(మొదటిపేజీ తరువాయి)

మండలం ఏరువారిపల్లి పంచా యతీ అజీస్ పురం పరిధిలోని ఈదల వాగు వద్ద ఆర్అండ్‌బి రోడ్డు పక్కన 539 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో పాముల కులానికి చెందిన 10 కుటుంబాల పేదలు 20 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారు. వాగు గా ఉన్న ఈ భూమిలో వందలాది ట్రాక్టర్ల మట్టిని తోలి.. నివాసాలు ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నారు.

ఈ భూమి తమదంటూ..

20 ఏళ్లుగా పేదలు నివాసం ఉంటున్న భూమి తమదంటూ అధికార పార్టీ నేత సైకం మాలకొండారెడ్డి, మర్రిపూడి మండలం, గార్లపేట వీఆర్వో సుబ్బారెడ్డితో కలిసి వచ్చి.. రెండు నెలల క్రితం పేదల నివాసాలను జెసిబితో కూల్చివేశారు. పేదలు ఈ భూమిలోకి రాకుండా కంచెలు ఏర్పాటు చేశారు. దీంతో నిరాశ్రయులైన పేదలు రెండు నెలలుగా అధికారుల చుట్టూ తమకు న్యాయం చేయాలంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇళ్లు కూల్చేయించిన వారు పేదలను పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి.. ఇబ్బందులకు గురి చేశారు. ఈ భూమిలోకి రావద్దంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమి..

ఈ భూమి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ప్రభుత్వ భూమిగా ఉన్న దానికి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందో తేల్చాల్సిన రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసు వారు పేదలను ఇబ్బంది పెట్టడం వెనుక ఆసక్తి ఏమిటో వారికే తెలియాలి.

సిపిఎం నాయకులను ఆశ్రయించిన పేదలు

రెండు నెలల క్రితం నిరాశ్రయులైన పేదలు తమకు న్యాయం చేయాలంటూ సిపిఎం నాయకులను ఆశ్రయించారు. సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసికేశవరావు ఆధ్వర్యంలో ఈ నెల 2న మీకోసం కార్యక్రమంలో తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలోనూ వినతిపత్రం అందజేశారు. న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై తహశీల్దార్ ఏవి రవిశంకర్‌ను వివరణ కోరగా సమస్య తన దష్టికి కొద్దిరోజుల క్రితమే వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తేనే వాస్తవం తెలుస్తుందని చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామన్నారు.

20 ఏళ్లుగా ఎవరూ రాలేదు

నాగులూరి నాగలక్ష్మి, బాధితురాలు:



20 సంవత్సరాలుగా ఈ భూమిలో నివాసాలు ఏర్పరచుకొని జీవిస్తున్నాము. 20 ఏళ్లలో ఈ భూమి తమదని ఎవరూ రాలేదు. సుమారు రెండు నెలల క్రితం సైకం మాలకొండారెడ్డి, వీఆర్వో సుబ్బారెడ్డి వచ్చి.. ఈ భూమి తమది అంటూ దౌర్జన్యంగా నివాసాలు కూల్చి ఖాళీ చేయించారు. దీంతో చెట్ల కింద జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నివాసాలు కూల్చేశారు

నల్లగండ్ల నాగేశ్వరరావు, బాధితుడు:



ఏరువారిపల్లి పంచాయతీ అజీస్‌పురం పరిధిలోని ఈదల వాగు వద్ద 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. లక్షలు ఖర్చుపెట్టి నివాసాలు నిర్మించుకున్నాం. పంచాయతీకి ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నాం. ప్రభుత్వ భూమిలో తాము ఉండగా ఆ భూమి మాధని దౌర్జన్యంగా కూల్చివేశారు. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులు పెట్టారు. రెండు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. న్యాయం చేస్తామని బ్రోకర్లు మా దగ్గర డబ్బులు కాజేశారు. కానీ మాకు న్యాయం జరగలేదు. న్యాయం కోసం సిపిఎం నాయకులను ఆశ్రయించాం. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

పేదలకు న్యాయం చేయాలి

పిసి కేశవరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి, కనిగిరి



కనిగిరి మండలం అజీస్ పురం పరిధిలో 539 సర్వేనెంబర్ గల భూమి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా నమోదయి ఉంది. 20 ఏళ్లుగా పేదలు ఉంటున్న నివాసాలను తొలగించడం దుర్మార్గం. ప్రభుత్వ భూమి లేక ప్రైవేటు భూమి అని తేల్చడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సివిల్ కేసులో పోలీసులు జోక్యం చేసుకోవడం సరికాదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

ఏడాది పాలనపై 'కూటమి' సంబరాలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు సూచన మేరకు ఒ కూటమి నేతలు బుధవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. స్థానిక అద్దంకి బస్టాండ్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి, జనసేన, బిజెపి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఎపి లైక్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ అరాచక పాలనకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి ఏడాది పూర్తయిందన్నారు. నియంత పోకడల నుంచి రాష్ట్రానికి విముక్తి, గాడి తప్పిన వ్యవస్థలను చక్కదిద్ది పట్టాలెక్కించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏడాది పాలనలో ప్రజా సంక్షేమమే పరమావధిగా అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేశారన్నారు. నవ్యాంధ్ర నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజారాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబడుతున్నట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపన ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో సూపర్ సిక్స్‌లోని నాలుగు పథకాలను అమలు చేశారని, జులైలో తల్లికి వందనం, ఆగస్టు 15 నుంచి ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్ షేక్ రియాజ్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, టిడిపి నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్లు శింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, శ్రీరామమూర్తి, బండారు మదన్, గుర్రాల రాజ్‌విమల్, చుండి శ్యామ్. వై.శశికాంత్ భూషణ్, మహిళా నాయకులు ఆర్ల వెంకటరత్నం, రాయపాటి సీతమ్మ, పెద్దిశెట్టి వరలక్ష్మి, షేక్ ఆరిఫా, నాళం నరసమ్మ, పసుపులేటి సునీత, గుంజి విజయలక్ష్మి, జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు

వృద్ధాశ్రమంలో సిఐ కుమార్తె జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలోని సంజీవిని వద్ద, అనాధాశ్రమంలో సిఐ రామకోటయ్య కుమార్తె వర్షిని జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వద్ధుల మధ్య వర్షిని చేత సిఐ కేక్ కట్ చేయించారు. అనంతరం వద్ధులకు కేక్ పంచిపెట్టారు. అనంతరం వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.అనంతరం సిఐ రామకోటయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి వద్ధుల మధ్య సరదాగా గడిపారు. పుట్టినరోజు సందర్భంగా మనం ఎంతో వధా ఖర్చు పెడుతుంటామని అందులో కొంత భాగమైన వద్ధుల కోసం లేదా అనాధల కోసం ఖర్చు పెట్టడం వల్ల వారికి మేలు చేకూరుతుందని సిఐ రామకోటయ్య తెలిపారు.



వృద్ధాశ్రమలో కేక్ కట్ చేసున్న వర్షిని

విద్యామిత్ర స్టాక్ పాయింట్ల తనిఖీ

ప్రజాశక్తి-టంగుటూరు

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టాక్ పాయింట్లను సమగ్ర శిక్ష సిఎంఒ సోనీ రూత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జరుగుమల్లి మండల విద్యా శాఖ కార్యాలయాన్ని, ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, బెల్టుల నాణ్యతను పరిశీలించారు. మిగిలిన సామాగ్రి త్వరలో సరఫరా అవుతుందని తెలిపారు. పాఠశాలలు పున:ప్రారంభించే నాటికి విద్యార్థుల చేతుల్లో విద్యామిత్ర సామగ్రి ఉండాలని ఆదేశించారు.

పోలీసులు పాలకపక్షమే.!

(మొదటిపేజీ తరువాయి)

సిపిఎం జిల్లా నేతలపై ఆనాడు తెలుగుదేశం హయాంలో నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెట్టించారు. తర్వాత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇదే పార్టీ నేతలపై అమరావతి రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలిపిన అనేక పార్టీల నేతలపైనా కేసులు బనాయించారు. సాగునీటి కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులపైనా అప్పట్లో లాఠీఛార్జి, గాల్లోకి కాల్పులు జరిపారు. ఇవన్నీ చట్టపరిధిలో లేని అంశాలే.. వీటికి ఏదో అత్యవరసర పరిస్థితిని జోడించి శాంతిభద్రతల్లో భాగంగానే చేశామని మంత్రులు, అధికారులు సమాధానాలు చెబుతారు. ఇపుడూ అదే జరుగుతోంది. ఇంతెందుకు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులు, విద్యార్థులు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తమ హక్కుల కోసం, వేతనాల కోసం ఉద్యమిస్తుంటేనే పోలీసులు వారి నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగించారు. కేసులు పెట్టారు. రోడ్లపైకి వచ్చిన వారిపై లాఠీలు ప్రయోగిస్తున్నారు. అంగన్‌వాడీలను రోడ్లపై ఈడ్చేస్తున్నారు. ఇవన్నీ చట్టపరిధిలో లేవు. పోలీసులను, ఆ వ్యవస్థను పాలకులు తమ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకుంటున్నారు. ఆనవాయితీ కూడా.. దాని ఏర్పాటు ఉద్దేశం కూడా అదేనంటారు. పోలీసు శాఖ నియామకాలన్నీ సిఫార్సులపైనే సాగుతున్నాయి. అయితే ఆ వ్యవస్థను చట్టపరిధిలో పనిచేసేలా పాలక పార్టీలుంటాయా? అనేదీ ఆలోచించాలి. అధికారం పోయాక విమర్శలు చేసేముందు గతంలో మనం ఎలా వ్యవహరించామన్న అంశంపై పార్టీలు ఆలోచించాలి. అప్పుడే మనమేం చేశామో తేటతెల్లమవుతోంది.

ప్రజాశక్తి
గురువారం 5 జూన్ 2025

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

కనిగిరిలో వెన్నుపోటు దినం ర్యాలీ

ప్రజాశక్తి-కనిగిరి

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విమర్శించారు. మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కనిగిరి పట్టణంలో నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, దద్దాల మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చే యడంలో విఫలమైందన్నారు. బూటకపు హామీలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి, వైసిపి అంగన్వాడీ విభాగం రాష్ట్ర సెక్రెటరీ తమ్మినేని సుజాత రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సిహెచ్ సాల్మన్ రాజు, ఎస్.మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

వెన్నుపోటుకు కేరాఫ్ బాబు, పవన్

ప్రజాశక్తి-కొండపి: వెన్నుపోటుకు కేరాఫ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా పాటించాలని జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొండపి మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్యఅతిథిగా ఆదిమూలపు సురేష్ పాల్గొ న్నారు. ఈ ర్యాలీ కొండపిలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు నిర్వహించారు. వైఎస్సార్, మాజీ కన్వీనర్ ఆరికట్ల వెంకటేశ్వర్లు, రావెళ్ల వెంకయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిప త్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో సురేష్ మాట్లాడుతూ హామీల అమలుపై ప్రశ్నించే గొంతులను రెడ్‌బుక్ కుట్రలతో నొక్కేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి నట్టేటను ముంచిందన్నారు. ఈ



ర్యాలీలో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిచ్చిరెడ్డి, ఆరు మండలాల కన్వీనర్లు, రాష్ట్ర ఇంటలెక్చువల్ ప్రధాన కార్యదర్శి బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, రాష్ట్ర ఐటీవింగ్ జోనల్ ప్రెసిడెంట్ మణికంఠేశ్వర్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రెటరీ రామచంద్రరావు, ఆరు మండలాల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వెలిగండ్ల: బుధవారం కనిగిరిలో వైసీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, వైసీపీ కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు వేణు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ గుండా అధ్యక్షులు పొల్లా సుబ్రహ్మణ్యం, కాకర్ల వెంకటేశ్వర్లు, నాగూర్ యాదవ్, ఎలికా నారాయణ,తాతపూడి సురేష్ బాబు, తాతపూడి నాని, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొబ్బా వెంకటరెడ్డి, కుప్పనబోయిన వెంకటరామయ్య, సోమయ్య, రంగయ్యలు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ



యువకుడి మృతదేహం

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. శింగరాయకొండ ఉలవపాడు రైల్వే స్టేషన్‌ల మధ్యలో సుమారు 35 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఒంగోలు రైల్వే ఎస్ఐ కే మధుసూదన్ రావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.



నివాళులు అర్పిస్తున్న వినోద్ సింగ్

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన బిఎస్ఎఫ్ జవాన్ పాండూరి ప్రదీప్ కుమార్ అంత్యక్రియలు బుధవారం నాడు అధికార లాంఛనాలతో ముగిశాయి. పాకల గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్ బిఎస్ఎఫ్‌లో పనిచేస్తున్నాడు. సెలవుపై ఇంటి వద్ద ఉంటూ స్నేహితులతో కలిసి మోటార్ బైక్ మీద వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మంగళవారం రాత్రి మృతదేహాన్ని ఒంగోలు నుంచి భారీ ర్యాలీతో కొవ్వొత్తుల ప్రదర్శనతో పాకల స్వగ్రామానికి తీసుకువచ్చారు. చిత్తూరు జిల్లా నుంచి బెటాలియన్ బృందం వచ్చి వినోద్ సింగ్ ఆధ్వర్యంలో ప్రదీప్ కుమార్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అధికార లాంఛనాలతో మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రదీప్ కుమార్ కుటుంబ సభ్యులు అతను స్నేహితులు భారీగా వచ్చి ప్రదీప్ కుమార్‌కు నివాళులు అర్పించారు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం చిరస్మరణీయులు

ప్రజాశక్తి-చీమకుర్తి: ప్రముఖ గాయకులు దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం చిరస్మరణీయులని మద్దిపాడు ఏఎంసి చైర్మన్ మన్నం రాజ్యలక్ష్మి ప్రసాదు పేర్కొన్నారు. బుధవారం ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాసేవ నేషనల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్లోని ఎస్పీ బాలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్య లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రమ ణ్యం దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాసేవ నేష నల్ ఆర్ట్స్ సంస్థ వ్యవస్థాపకులు మద్దాలి మాధవ రావు, డాక్టర్ బి.రాహుల్, బ్రాహ్మణ సేవా సమి తి నాయకులు ప్రసాదు, శ్రీధర్ శర్మ, హేమంతాచార్యులు, లక్ష్మీ నరసయ్య, సాయి కృష్ణ, సిహెచ్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బాలసుబ్రహ్మణ్యంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

దర్శి: గాన గంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఘన నివాళి అర్పించారు. సినీ వినీలాకాశంలో ధృవతారగా వెలిగి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు తెలుగు భాష ఉన్నంత కాలం వినిపిస్తూనే ఉంటాయన్నారు. ఆ మధుర గాయకుడికి ఆయన జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించారు.

ఆరు నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మెగా డిఎస్సీకి సంబంధించి ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) పద్ధతిలో ఈ నెల 6 నుంచి 30 వరకు ఎనిమిది పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్ బుధవారం పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయము 9 నుంచి 12 వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీ, రైస్ కృష్ణ సాయి ప్రకాశం కాలేజీ, రైస్ కృష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీ, క్విజ్ కాలేజీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి సోషల్ ఆక్షన్ ఇండియా, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయమునకు 1 గంట 30 నిమిషాలు ముందుగా రావాలని సూచించారు. సెల్ ఫోన్స్, జామెంట్రి బాక్సులు, బ్యాగులు మరియు ఎలక్ట్రికల్ డివైజెస్‌లను అనుమతించబడవన్నారు. పీహెచ్‌సి అభ్యర్థి, స్క్రైబ్ లిస్టులో పేరు లేకపోతే లేదా దరఖాస్తులో పీహెచ్‌సి వివరములు పేర్కొనబడకపోతే సంప్రదించాలని చెప్పారు. ఆ మేరకు అర్హత మేరకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విజువల్లీ ఛాలెంజ్డ్/ఆర్థోపెడికల్ ఛాలెంజ్ (రెండు చేతులు లేని వారు) అభ్యర్థుల విషయంలో నిబంధనల తప్పనిసరిగా 50 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించబడుతుందన్నారు.

హాల్ టిక్కెట్‌పై 'నో ఫోటోగ్రాఫ్' ఉన్న అభ్యర్థులు, తాజా ఫోటోగ్రాఫ్ మరియు సరైన గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు. నామినల్ రోల్స్ అభ్యర్థి పేరు, తండ్రి పేరు, లింగం వంటి చిన్న స్పెల్లింగ్ తప్పులను మార్చుకోవడానికి అభ్యర్థులు టెట్ పరీక్షా కేంద్రంలోని డిపార్ట్‌మెంటల్ అధికారులను సంప్రదించవచ్చన్నారు. పరీక్ష సమయంలో ఏదైనా సమస్య ఉంటే కమాండ్ కంట్రోల్ రూమును సంప్రదించాలన్నారు. ఒంగోలు డీఈవో కార్యాలయంలో ఏపీ మెగా డీఎస్సీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని, ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే శివ కుమార్‌ను ఫోన్ నెం.8125264606లో సంప్రదించవచ్చని సూచించారు.

రేషన్ డీలర్ అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్

ఆనికాలపల్లి రేషన్ షాపు డీలర్ అక్రమాలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆనికాలపల్లి సర్పంచ్ సిహెచ్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. తమ రేషన్ షాప్ డీలర్ రేషన్ సరుకులు పంపిణీ చేయకుండా ఇంటింటికీ తిరిగి బయోమెట్రిక్ వేయించుకొని సరుకులకు బదులు కేజీ బియ్యం రూ.10 వంతున నగదు పంపిణీ చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంపై వీఆర్వో జాన్ లిపికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, దీంతో తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆ మేరకు ఆర్డిఓ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ షాప్ డీలర్ అక్రమాలను అరికట్టాలని ఆయన కోరారు.

మంత్రి స్వామిని విమర్శించే స్థాయి లేదు

ప్రజాశక్తి-శింగరాయకొండ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదని శింగరాయకొండ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. బుధవారం రాత్రి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మంత్రి స్వామి శాసనసభ్యులుగా గెలిచి సంవత్సరం కావడంతో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని విమర్శించే స్థాయి ఎక్కడ ఉందన్నారు. నియోజకవర్గంలో రాష్ట్రంలో న్యాయబద్ధంగా పరిపాలన చేస్తున్న స్వామిని విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయంలో దళితుల మీద దాడులు జరుగుతుంటే మాజీ మంత్రి సురేష్ ఎక్కడ ఉన్నాడో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింగయ్య, మించల బ్రహ్మయ్య, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు, సుదర్శి ప్రసాదరావు, చిగురుపాటి శేషగిరి, పి.శ్రీనివాసరావు, నేలపాటి శంకర్, పామర్తి మాధవరావు, మేరుబోయిన యోగానంద్, గాలి హరిబాబు, ఎస్.కె.యస్దాని, బొడ్డు రమేష్, కనిగిరి వెంకటేశ్వర్లు, ఇమ్మడిశెట్టి రామారావు, కోట శ్రీను, ముళ్ళపూడి సత్యనారాయణ, ఒలేటి రవిశంకర్‌రెడ్డి, శీలం సుబ్రహ్మణ్యం, బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, సన్నెబోయిన మాలకొండయ్య, నర్రా రాంబాబు, కన్న శ్యాంప్రసాద్, షేక్ బచ్చే తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఒంగోలు ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆమెను కలిసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించుకున్నారు.

ఎస్‌పిని కలిసిన ఎంపి మాగుంట

జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పిని కలసిన ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌పిని కోరారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించుకున్నారు. ఎస్‌పిని కలిసిన వారిలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, తాతా ప్రసాద్, అయినాబత్తిన ఘనశ్యాం, బెల్లం సత్యనారాయణ, కుప్పా రంగనాయకులు ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపి మాగుంట



కూలీలతో మాట్లాడుతున్న ఎం ఆంజనేయులు

ఉపాధి కూలీల వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఉపాధి కూలీల రెండు నెలల కూలి బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అనమలమూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన బుధవారం మాట్లాడారు. రెండు నెలల నుండి తమకు కూలి ఇవ్వడం లేదని తెలిపారు. రెండు నెలల బకాయి కూలీని వెంటనే చెల్లించాలని, లేకుంటే పోరాటానికి సిద్ధం కావలసి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గాయకుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కర్లపాలెం



స్వామిని సన్మానిస్తున్న గుండ్రెడ్డి శివ

'రఘుకుల తిలక రారా' పాట పాడి బాపట్ల పేరు ప్రఖ్యాతలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేసిన వ్యక్తి కొండలు స్వామి అని జిఎస్ఆర్ బిల్డర్స్, డవలపర్స్ గుండ్రెడ్డి శివ అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శాలువా, పూలమాలతో కొండలస్వామిని ఘనంగా బుధవారం సన్మానించారు. కొండలు స్వామి పాడిన రఘు కుల తిలకా పాట ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియాలో 40కోట్ల మంది రీల్స్ చేయడం హర్షణీయమని అన్నారు. కొండలుస్వామి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రఘుకుల తిలకా పాట ట్రెండ్ అయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖులు తనను అభిమానించి సన్మానించడం ఆనందంగా ఉండడంతో పాటు తనకు ఇంకా బాధ్యత పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో పుప్పాల సాంబశివరావు, పంతం నాగేశ్వరరావు, ఈవూరి మణికంఠ, కెఎన్ఎం శ్రీనివాసరావు, త్రిపురం సంజీవరెడ్డి, కారు ప్రసాద్ పాల్గొన్నారు.



క్రికెట్ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్ఐ రవీంద్ర

క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

క్రీడలు మానసిక ఉల్లాసన్ని కలిగిస్తాయని, ప్రతి యువకుడు క్రీడా స్ఫూర్తి అలవార్చుకోవాలని ఎస్ఐ రవీంద్ర అన్నారు. గుండ్రెడ్డి శివ వెంచర్‌లో బుధవారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రధానంలో ఆయన మాట్లాడారు. మొదటి బహుమతిని ఏట్రవారిపాలెంకి చెందిన పులుగు శ్రీనివాసరెడ్డి మెమోరియల్ టీం సాధించిందని, 2వ బహుమతిని ఎంవి రాజుపాలెంకు చెందిన సేవాగ్ యువరాజ్ ఫ్రెండ్ సర్కిల్ అందుకుందన్నారని తెలిపారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కుంచాల శివకృష్ణారెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. బహుమతులను టిడిపి నాయకులు భోజరాజు, ఎస్ఐ రవీంద్ర ఇరుజట్ల కెప్టెన్లకు అందజేశారు.

నేడు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం ప్రతిజ్ఞ జరుగుతుందని మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. ఆర్పీలు, ఎస్‌హెచ్ జి సభ్యులకు మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నల్లబర్లీ పొగాకు కొనే వరకు ఐద్యఉద్యమం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

నల్లబర్లి పొగాకు కొనుగోలుపై కంపెనీల ఆలస్యానికి నిరసనగా గుంటూరులోని జిపిఐ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు రైతులు హాజరు కావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. మండలంలోని నూజిల్లపల్లి దళిత కాలనీలో కౌలు రైతుల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నల్లబార్లి పొగాకు సాగు చేయాలని రైతులను ప్రోత్సహించిన జిపిఐ కంపెనీ తోపాటు ఇతర కంపెనీలు కూడా రెండు నెలలుగా రైతులకు కనపడకుండా మొహం చాటేసేయని అన్నారు. జిల్లాలో 80వేల ఎకరాల్లో నల్లబర్లి పొగాకు సాగు చేశారని అన్నారు. రైతుల ఇళ్ల దగ్గర మండెలు కట్టి రెండు నెలల నుండి పొగాకు మగ్గుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకొని వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసన సభ్యుడు ఏలూరు సాంబశివరావు వంటి నాయకులు కంపెనీలతో మాట్లాడి ఒప్పించినప్పటికీ ఇంతవరకు ఒక కేజీ కూడా కొనలేదని చెప్పారు. పొగాకు సాగు కోసం తెచ్చిన అప్పుల వాళ్ళు రైతులను ఇబ్బంది పెడుతున్నారని, పిల్లల స్కూలు ఫీజులు చెల్లించుకునే రోజులు కావడం వలన డబ్బులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కొంతమంది కూలీలకు కూడా ఇంతవరకు డబ్బులు ఇయ్యలేని పరిస్థితి ఉందని అన్నారు. గత నెల 24న పంటల ధరల నిర్ణయ కమిటీ మార్టూరు దగ్గర సమావేశపెట్టి పొగాకు కంపెనీలకు పొగాకు కొనాలని, మొదటి రకం క్వింట రూ.12వేలు, 2వ రకం రూ.6వేలకు తగ్గకుండా కొనాలని నిర్ణయించారని అన్నారు. ఈ నిర్ణయానికి అంగీకరించి ఇప్పుడు మాట మారుస్తున్నారని గుర్తు చేశారు. దీని వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పొగాకుకు మంచి ధర ఇవ్వక, త్వరగా గేట్ పాస్‌లు ఇవ్వక, క్వాలిటీ పేరుతో మంచి పొగాకును కూడా పక్కన పడేస్తున్నారని అన్నారు. పొగాకు కొనకపోవడంతో ఈపాటికే ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఒకరు ఆత్మహత్యా యత్నం చేశారని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే అనేక దారుణాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ప్రోత్సహించి, ఇప్పుడు పట్టించుకోని కంపెనీల యాజమాన్యాలను నిలదీసేందుకు గుంటూరులోని జిపిఐ కార్యాల యం ముందు ఈనెల 5న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో రైతులు పాల్గొనాలని కోరారు.

యద్దనపూడి : మండలంలోని అన్ని గ్రామాల్లో నల్లబర్లి పొగాకు సాగు చేసిన రైతులు, కౌలు రైతులు ఈనెల 5న గురువారం గుంటూరులోని జిపిఐ ప్రధాన కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు హాజరు కావాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి రాంబాబు కోరారు. ప్రభుత్వం మార్క్ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిపిఐ అధికారులను కలిసి ఎక్కువ రేటు వేయవలసిందిగా విజ్ఞప్తి చేసిన రైతుల చెక్కులు (బేళ్లు) కొనడం లేదని కొంత మంది రైతులు తెలిపారు. మండలంలోని పోలూరు, యద్దనపూడి, పూనూరు, యనమదల, అనంతవరం గ్రామాల్లోని రైతులతో కలిసి మాట్లాడి వారిని జిపిఐ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు రావాలని కోరారు. ఆయన వెంట రైతులు సుబ్బారావు, వెంకట్రావు, శ్రీనివాసరావు, వై రాజు, నాగరాజు పాల్గొన్నారు.

గొరిగపూడితో ఎనలేని అనుబంధం

ప్రజాశక్తి - భట్టిప్రోలు



మొక్కలు నాటుతున్న పిఆర్ఎసి ఆనంద్

మండలంలోని గొరిగపూడిలో శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంను పంచాయితీ రాజ్ అసిస్టెంట్ కమీషనర్ కామరాజుగడ్డ ఆనంద్ బుధవారం సందర్శించారు. గొరిగపూడిలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారిని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పూర్వీకులు నడయాడిన గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం గురించి తెలుసుకునీ తమ కుటుంబ సభ్యులు చాలా ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ తీరు, కల్పించిన వసతులు చాలా బాగున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. తన తల్లి జన్మస్థానమైన గొరిగపూడి గ్రామంతో తనకు మంచి అనుభూతి ఉందని తెలిపారు. తన బాల్యంను గుర్తు చేసుకున్నారు. గ్రామ అభివృద్ధికి తమ శాఖాపరంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గ్రామంలో శివాలయం వెనుక నిర్మాణ ప్రారంభంలో ఆగిపోయిన ఆరోగ్య భవనం, రైతు సేవా కేంద్రాలు చూసి అధికారులకు ఫోన్ చేసి పరిస్థితి తెలుసుకుని తిరిగి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. శివాలయం ప్రాంగణంలో సర్పంచ్ గరిగపాటి మల్లికా వెంకటేశ్వరరావు, తన మేనమామ పులిగడ్డ భగవాన్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఉసిరి, మారేడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇక్కుర్తి సాంబశివారు, ధూళిపాళ్ళ అప్పారావు, యడ్ల సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంగులూరు ఎఓ సుబ్బారెడ్డి

పచ్చిరొట్ట పంటల సాగు చేపట్టండి

ప్రజాశక్తి - పంగులూరు

ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు కురుస్తున్నందున ఖరీఫ్‌లో రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేపట్టాలని ఎఓ డి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బూదవాడ, కోటపాడు, కళ్ళం వారిపాలెం గ్రామాల్లో ఖరీఫ్ సన్నద్ధత ప్రచారంలో భాగంగా రైతులతో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాలు మేరకే ఎరువులు, పురుగు మందుల వినియోగించాలని చెప్పారు. కౌలు రైతులు సాగుతారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వ అందజేసి అనేక సదుపాయాలు పొందుతారని అన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు పొందాలని చెప్పారు. పంటల మార్పిడి విధానం చేపట్టడం ద్వారా చీడపీడలు నివారించి అధిక దిగుబడి పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ ఎం అలెగ్జాండర్, అక్షరాణి, నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, గుదిబండ్ల చిన్న ఆదిరెడ్డి పాల్గొన్నారు.

సుపరిపాలనతో కూటమి ప్రభుత్వం



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చీరాల

కూటమి ప్రభుత్వం విజయానికి ఏడాది పూర్తయి రాష్ట్ర ప్రజలకు సూపరిపాలన అందిస్తూ ప్రజల మన్నలను పొందుతూ అభివృద్ధి పదంలో ముందుకు వెళుతుందని టిడిపి నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిపాలనైన సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య ఆదేశానుసారం ప్రజా విజయోత్సవ సంబరాలు బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పాలన కొనసాదని, ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సైకో పాలనతో వెనక్కి వెళ్లిన పరిశ్రమలను తిరిగి రాష్ట్రానికి రప్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 6లక్షల ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పించిందని, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నామని అన్నారు. ముందుగా కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధనరావు, మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, జనసేన జిల్లా కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, జనసేన వీర మహిళ కారంపూడి పద్మిని, మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

యద్దనపూడి : రాష్ట్రలో సూపరిపాలన ప్రారంభమై ఏడాది పూర్తయిందని జనసేన మండల అధ్యక్షుడు అయ్యప్ప గనిపి అన్నారు. జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షులు పటాన్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కోడే లక్ష్మణ్, మహిళలు వెలిశెట్టి శిరీష, కోడె పార్వతి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన అధ్యక్షులు గనిపి అయ్యప్ప



మాట్లాడుతున్న కారంచేడు ఎఓ కె సుధీర్‌బాబు

కారంచేడు : మండలంలోని స్వర్ణ రైతు సేవ కేంద్రలో ఖరీఫ్ సాగు సమాయత్తంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఓ కె సుధీర్ బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం రుతుపవనాల ప్రవేశం, అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల వారీగా రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తం కావాలని చెప్పారు. 50 శాతం రాయితీపై వచ్చిరొట్ట విత్తనాలు జీలుగ కేజీ రూ.61.50, జనుము రూ. 54.5 ఇస్తున్నట్లు తెలిపారు. కావలసిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోని పొందవచ్చని అన్నారు. పచ్చిరొట్ట పంటల సాగు చేపట్టి, భూసారాన్ని మరింతగా పెంచుకోవా లని అన్నారు. కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వం అందజేసే రాయితీలు, సదుపాయాలు వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ దుర్గాప్రసాద్, శారద పాల్గొన్నారు.

నేడు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్
జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో 'వన మహోత్సవం-2025' కార్యక్రమంలో భాగంగా గురువారం నగర ప్రజలకు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని మినీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, పలువురు కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొని ఉచితంగా మొక్కలు స్వీకరించి.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలో పలు చోట్ల మొక్కలు నాటే ప్రదేశాలను కమిషనర్ వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. మొక్కలు పంపిణీ చేసే మినీ స్టేడియాన్ని కూడా సందర్శించారు. అక్కడ తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కమిషనర్ వెంట అధికారులు ఉన్నారు.

క్వారీ రబ్బిష్ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్
స్థానిక 18 వ డివిజన్ చెరువు కొమ్ముపాలెం పరిధిలోని తుఫాన్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్వారీ రబ్బిష్ రోడ్డు పనులను మేయర్ గంగాడ సుజాత బుధవారం ప్రారంభించారు. రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు జెసిబికి కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్
డి1 పరిధిలోని 11 కెవి మున్సిపల్ ఫీడర్, 11 కెవిఆర్‌పి రోడ్డు ఫీడర్, 11 కెవి గొడుగుపాలెం ఫీడర్‌లలో చెట్టు కొమ్మలు తొలగించటం కోసం, లైన్ మరమ్మతుల కోసం గురువారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, మున్సిపల్ ఆఫీస్, శివాలయం, సివిఎన్ రీడింగ్ రూమ్, గాంధీ రోడ్, ఏనుగు చెట్టు, మాతాశిశు వైద్యశాల , కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్, రాజాపానగల్ రోడ్డు, జమ్మిచెట్టు బజారు, సాయిబాబా టెంపుల్ ఎదురు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, గద్దలగుంట, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ డిఇఇ కెవి.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జిల్లా జైలులో ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న జైలు అధికారులు, ఉపాస్ వైద్యులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్
ఒంగోలులోని జిల్లా జైలులో అడిషనల్ సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు వారు ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో జిల్లా జైలు సిబ్బంది, ఖైదీలు.. సుమారు 200 మందికి షుగరు, బిపి, బోన్ మారో డెన్సిటీ పరీక్షలు, ఈ.సి.జి. గుండె సంబంధ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి... మందులు అందజేశారు. శిబిరంలో ఎముకలు, కీళ్ల మరియు జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ ప్రకాష్ చవల, డయాబెటాలజిస్ట్, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్ వైద్యసేవలందించారు. గుండె సంబంధ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని ప్రముఖ గుండె వైద్య నిపుణులు, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ చివుకుల తెలియ చేశారు. ఒంగోలు పట్టణంలో మరియు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంలో ఉపాస్ హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మతేజ, జైలర్లు వి.రమేష్, ఎమ్.శ్రీనివాస్, డిప్యూటీ జైలర్ వసంతరావు, ఫార్మసీ ఆఫీసర్ ఎమ్‌వి.సురేష్‌బాబు, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్, ఆర్థో ఫీజియన్ అసిస్టెంట్ జగదీశ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఆర్‌టియు వికాస్‌లో మోడల్ డీఎస్సీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ
ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒంగోలు అంజయ్య రోడ్‌లోని వికాస్ కోచింగ్ సెంటర్ నందు బుధవారం నాడు డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. పోటీ పరీక్షలు అభ్యర్థులకు ఆత్మస్థైర్యాన్నిస్తాయని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మోడల్ టెస్టులో మొదటి స్థానం సాధించిన వారికి పదివేల రూపాయలు, రెండవ స్థానం సాధించిన వారికి ఐదు వేల రూపాయలు, మూడవ స్థానం వారికి మూడు వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు అధ్యక్షులు పి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మోహన్ రావు, వీరయ్య పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ 474 పోస్టులకు
సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ
ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఖాళీగా ఉన్న 474 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సెకండరీ గ్రేడ్ టీచర్స్ ప్రమోషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం నాడు స్థానిక డిఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ స్కూల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమోషన్ చేపట్టేందుకు అర్హత కలిగిన ఎస్‌జిటి (సెకండరి గ్రేడ్ టీచర్స్)ల సీనియారిటీ జాబితా రూపొందించామని, ఆ జాబితా ప్రకారం వారి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 89, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 312,మున్సిపల్ యాజమాన్యంలోని పాఠశాలలో 37, కార్పొరేషన్ యాజమాన్యంలోని పాఠశాలల్లో 27 మొత్తం 474 ఖాళీలకు సంబంధించిన వెరిఫికేషన్ పూర్తి గావించామన్నారు. కమిషనరేట్ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ప్రమోషన్లు చేపడతామన్నారు. జిల్లా లో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) 25, ఉర్దూ 2, హిందీ 29, ఇంగ్లీష్ 22, మాథ్స్ (తెలుగు) 44, (ఉర్దూ మాధ్యమం) 3, పిఎస్ (తెలుగు) 16, (ఉర్దూ) 4, బిఎస్ (తెలుగు) 40, (ఉర్దూ)3, సోషల్ (తెలుగు) 38, (ఉర్దూ) 1, పిడి 67, ఎస్‌ఎ (స్పెషల్) 8, పిఎస్ హెచ్‌ఎం 172 ఖాళీలకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేస్తామన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు 142 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ
ఒంగోలు ప్రభుత్వ ఐటిఐలో బుధవారం నాడు జరిగిన క్యాంపస్ ప్లేస్ మెంట్ సెలక్షన్స్‌కు 142 మంది విద్యార్థులు ఎంపికయినట్లు ఐటిఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎంవి నాగేశ్వరరావు తెలిపారు. మేళాకు హాజరైన విద్యార్థులనుద్దేశించి ఐటిఐ శిక్షణ యొక్క ప్రాధాన్యతను గురించి నాగేశ్వరరావు వివరించారు. ఈ మేళాలో 159 మంది విద్యార్థులు హాజరుకాగా 142 మంది ఎంపికయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ శాఖ సిబ్బంది యస్.కె.బాషా, ఇ.విద్యాసాగర్, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ నడకలో పాల్గొనండి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్న పర్యావరణ హిత నడక(గ్రీన్ వాక్) కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణలో నేడు ప్రజలు తా ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవుడు తన స్వార్థంతో తానే పర్యావరణ విఘాతానికి కారణమవుతున్నాడన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ కళా క్షేత్రం నుండి నడక ప్రారంభమై, మినీ స్టేడియం వరకు సాగుతుందన్నారు.

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న అన్నా రాంబాబు



ఒంగోలులో వైసిపి నాయకుల ర్యాలీ

దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి
143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రజలకు పథకాలు ఇవ్వకుండా వెన్నుపోటు పొడిచారని దర్శి ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆరోపించారు. బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 'వెన్నుపోటు దినం' కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శిలో వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొదిలి రోడ్డులోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి చేపట్టిన ర్యాలీకి పోలీసుల ఆంక్షలు విధించారు. ముందుగా దర్శి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లాపరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఉండగా స్థానిక సీఐ వై.రామారావు, స్థానిక ఎస్ఐ ఎం.మురళితో పాటు డివిజన్ పరిధిలోని పొదిలి సీఐ వెంకటేశ్వరరావు, త్రిపురాంతకం సీఐ హసన్, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎస్ఐలు పార్టీ కార్యాలయంలోకి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కార్యాలయం లోపలికి వెళ్లి పోలీసులతో మాట్లాడి వచ్చారు. అనంతరం శాంతియుతంగా ర్యాలీ జరుపుకునేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారని, ఎవరూ ఎలాంటి నిరసనను తెలపవద్దనిశివప్రసాదరెడ్డి తెలిపారు. అనంతరము ర్యాలీ పార్టీ కార్యాలయం వద్ద బయలుదేరడానికి సిద్ధంగా ఉండగా అక్కడికి పోలీసులు వచ్చి ఎలాంటి ర్యాలీకి పర్మిషన్ లేదని, జెండాలు, ఫ్లకార్డులు ప్రదర్శించవద్దన్నారు. ఈ సందర్భంగా కొన్ని ఫ్ల కార్డులు, జెండాలు తీసేశారు. గడియార స్తంభం సెంటర్ వరకు వైసిపి నేతలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోకి అందరినీ అనుమతించకపోవడంతో కేవలం పది మంది మాత్రమే లోపలికి వెళ్లి తహశీల్దార్ శ్రావణకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డి, చింత శ్రీనివాసరెడ్డి, వెంకటసుబ్బయ్య, కాకర్లకృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడికొండ జయంతి, దర్శి పట్టణ అధ్యక్షుడు ముత్తునీడి సాంబయ్య, ముండ్లమూరు జడ్పిటిసి తాతపూడి రత్నంరాజు, కురిచేడు జడ్పిటిసి నుసుం నాగిరెడ్డిలు, ఎంపీపీలు గొల్లపాటి సుధారాణి, అచ్చయ్య, సుంకర సునీత, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నేతృత్వంలో పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ వైఎస్సార్ విగ్రహం వరకు చేరింది. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ మంజునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఏడాది పాలనలోనే సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచిందన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చలమారెడ్డి, రామావత్ అరుణాబాయి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఫిలిప్, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, వెంకట రమణారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, గుమ్మా యల్లేష్ యాదవ్, రాములు నాయక్ పాల్గొన్నారు.

మార్కాపురం: చంద్రబాబు ఇచ్చిన హామీల్లో పింఛను తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ధ్వజమెత్తారు. వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ పిలుపు మేరకు 'వెన్నుపోటు దినం' మార్కాపురం పట్టణంలో బుధవారం నిర్వహించారు. ముందుగా గడియారం స్తంభం సెంటర్‌లో దివంగత సిఎం డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా అన్నా రాంబాబు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఎఓ సిహెచ్ అశోక్‌రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.


యర్రగొండపాలెంలో తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న తాటపర్తి

ఒంగోలు సిటీ: ఉత్తుత్తి హామీలతో ఎన్నికల్లో గెలిచిన చంద్రబాబునాయుడు హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించాడని వైసిపి నాయకులు ఆరోపించారు. బుధవారం నాడు ఒంగోలులో వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. నిరసన ర్యాలీ అంబేద్కర్ భవన్ నుంచి ప్రకాశం భవనం మీదుగా చర్చి సెంటర్ ఆర్డీవో కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఒంగోలు శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు మీడియాతో మాట్లాడారు. ఏడాది కాలంగా ప్రజలను నమ్మించి మోసగించిన చంద్రబాబు హామీలను పెనాల్టీలతో చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఆరోపించారు. ప్రశ్నించే వారిపై కక్షగట్టి అణచివేత కార్యక్రమాలకు తెరలేపారన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, వైసీపీ నగర ఇన్‌ఛార్జి కటారి శంకర్రావు, ఉద్యోగ సంఘం మాజీ నేత బండి శ్రీనివాసరావు మాట్లాడారు. వందలాది మందితో అంబేద్కర్ భవన్ నుంచి ఆర్‌డిఒ ఆఫీస్‌కు చేరుకోగా సిఐ వై.నాగరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన ఆర్‌డిఒ కార్యాలయం లోనికి వెళ్ళనీయకుండా తన సిబ్బందితో గేట్ వద్ద అడ్డుకున్నారు. ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త రవిబాబు, బత్తుల బ్రహ్మారెడ్డి, కసుకుర్తి ఆదెన్న, కఠారి శంకర్ తదితరులు 10 మందిని లోపలకు అనుమతించగా వారు ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఒంగోలు కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, నాయకులు మన్నే శ్రీనివాసరావు, వైసిపి జిల్లా కార్యదర్శి సయ్యద్ అప్సర్, బడుగు ఇందిర పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ బి బాబురావు

పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం

ప్రజాశక్తి - బాపట్ల

వాతావరణంలో చోటు చేసుకుంటున్న అనేక మార్పుల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య సమస్యల భారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపిడిఒ బి బాబురావు అన్నారు. మండలంలో అడవి, స్టువర్టుపురం పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్త విడి విడిగా చెత్త సేకరణ వాహనాలకు అందించాలని అన్నారు. ప్రధానంగా వీధులు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలను ఆయన సందర్శించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ సారథి, మండల రిసోర్స్ పర్సన్ శశి కిరణ్ పాల్గొన్నారు.



మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

నగరవనంలో వన మహోత్సవం

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహొూత్సవ కార్యక్రమాన్ని సూర్యలంక రహదారిలోని అటవీ శాఖ నగర వనంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమ ఏర్పాట్లను అధికారులు బుధవారం పరిశీలించారు. ఎక్కడెక్కడ ఎఎ మొక్కలు నాటాలనే అంశాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో ఆర్డీఒ పి గ్లోరియా, తహశీల్దారు షేక్ సలీమా, మునిసిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఓ సునీత

కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలి

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని జంపని గ్రామంలో సాగుకు సమయాత్తం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ చందోలు సునీత మాట్లాడుతూ మట్టి నమూనా తీసి ల్యాబుకు పంపి సాయిల్ హెల్త్ కార్డు ద్వారా ఎరువులు వాడటం వలన ఉపయోగాలు తెలిపారు. పచ్చిరొట్ట పంటల వలన ఉపయోగాలు వివరించారు. పిల్లి పెసర విత్తనాలు 50శాతం రాయితీతో రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ప్రతి కౌలు రైతు రెవిన్యూ శాఖ ద్వారా ఇచ్చే కౌలు రైతు కార్డును తీసుకోవాలని, కౌలు రైతు కార్డు ఉండడం వలన వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలు అన్ని కౌలు రైతులకు వర్తిస్తాయని చెప్పారు. కావున కౌలు రైతులు భూయజమాని 1బి, ఆధార్, కౌలు రైతు ఆధార్ కార్డుతో అప్లికేషన్‌ను విఆర్ఓకు, లేదా విఎఎకి కానీ ఇచ్చి కౌలు కార్డు పొందాలని కోరారు. కార్యకమంలో విఎఎ మహాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగక అంధకారంలో 'అద్దంకి'

- పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- పన్ను వసూళ్లలో మొదటి స్థానం
- రోడ్డుపైన రోడ్డు వేస్తూ కొత్తప్రాంతాలు వదిలేయడం
- డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రజాశక్తి - అద్దంకి

పన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో అద్దంకి పురపాలక సంఘం మంచి గుర్తింపు పొందినది. అభివృద్ధి పనులు చేయడం, పట్టణ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో దిగువ స్థాయిలో కునారిల్లుతుందని పట్టణ ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నియోజకవర్గంలో ఒకే ఒక మున్సిపాలిటీ ఉన్నప్పటికీ ప్రజలకు అభివృద్ధి పనులు చేయడంలో వెనుకబడింది. దీనిని అధిగ మించాలంటే అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. అలాంటప్పుడే పాలనాపరంగా ముందుకు సాగుతుందని ప్రజలు, కౌన్సిలర్లు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వీధి దీపాలు లేక ప్రజలు ఇక్కట్లు

మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా వీధి దీపాలు సక్రమంగా లేక వెలుగక వృద్ధులు, వికలాంగులు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని వార్డుల్లో వీధి దీపాల సమస్య తీవ్రతరంగా ఉంది. ఆయా వార్డు కౌన్సిలర్లు అధికారులు వద్ద మొరపెట్టుకున్నప్పటికీ సమస్య మాత్రం ఈ గతేడాది కాలం నుండి మెరుగు పడలేదని చెబుతున్నారు. విద్యుత్తు దీపాలు నిర్వహించే దిగువ సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. వీధి దీపాలు వెలిగించే సమయంలో సిబ్బందికి సరైన వస్తువులు లేకపోవడానికి తోడు సిబ్బంది బాధ్యత రాహిత్యం తోడైంది. ఈ విషయమై కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళితే చూద్దాం, చేద్దామనే మాట తప్ప క్రొత్తమాట వినబడటం లేదని కౌన్సిలర్లే అసహనానికి గురవుతున్నారు. నామ్ ఎక్స్ప్రెస్ వే రహదారికి ఇరువైపులా గత వైసీపీ ప్రభుత్వంలో వీధి దీపాల నిర్వహణ ఉండేది. ప్రస్తుతం అవి వెలిగించవద్దని క్షేత్రస్థాయిలో సిబ్బందికి తెలిపినట్లు సిబ్బంది బహిరంగంగా ప్రజలకు చెబుతున్నారు.

మన ప్రభుత్వంమే కదా సర్దుకుపోదాం

కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు అభివృద్ధి పనులు గురించి అధికారుల వద్ద చర్చిస్తున్న సమయంలో మన ప్రభుత్వమే కదా సర్దుకుపోదామని జవాబు ఇస్తున్నారని బహిరంగంగానే కౌన్సిలర్లుతో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాన్ని విస్మరించి సీసీ రోడ్లు,



అద్దంకి మున్సిపల్ కార్యాలయం

డ్రైనేజీ ఉన్న ప్రాంతంలోనే మరలా కొద్దిపాటి అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారనే చర్చ ఉంది. కొత్త కాలనీల్లో కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంటి యజమానుల వద్ద ఇంటి అనుమతుల మంజూరుకు రూ.లక్షలు ప్రభుత్వానికి పన్ను రూపంలో వసూలు చేస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులు, డ్రైనేజీ, తాగునీరు, సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టడం లేదని ఆయా వార్డుల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. గత మూడు సమావేశాల్లో పనులపై తీర్మానాలు చేసినప్పటికీ ఒక్కపని ప్రారంభించలేదు. మున్సిపాలిటీలో నిధులు ఉన్నప్పటికీ పనులు చేయడంలో జాప్యం ఎందుకు అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పన్ను వసూళ్లలో రాష్ట్రంలో మొదటి స్థానం

ఇంటి పన్ను వసూలు చేయడంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ అభివృద్ధి చేయడంతో రాష్ట్రస్థాయిలో దిగునుందనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం, మురుగు నీరు పారుదులు లేక దోమలు, పందుల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తాగునీరు సక్రమంగా విడుదల కావడం లేదని శివారు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుక్కెడు నీటి కోసం గంటలు తరబడి కులాయి వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పన్ను వసూలు చేసిన ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తే మున్సిపాలిటీ మరి ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలు అనేక సందర్భాల్లో నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. సాగర్ కెనాల్ పట్టణం మధ్యలో వెళ్ళింది. ప్రజలు సాగర్ కెనాలను మురుగు కాలువగా ఉపయోగించు కొట్టున్నారు. పంట కాలువను తలపించేలా మురుగునీరు నిలువ ఉంటుంది. వర్షం కురిస్తే డ్రైనేజీ పొంగిపొర్లి ప్రధాన రోడ్లపై ప్రవహిస్తూ ఉంటుంది. శతాబ్దాల తరువాత ఇటీవల మురుగు కాలువలో మట్టిని తొలగిస్తున్నారు.

కొత్త నిర్మాణ దారుల నుండి అక్రమ వసూళ్లు

పట్టణంలో కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టే వారికి మున్సిపల్ అధికారులు వేసే పన్నులపై రాబడి కోసం అనేక కొర్రీలు వేసి అధిక మొత్తంలో వసూలు చేసే పరిస్థితి నెలకొని ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారికి సులభతరంగా అనుమతులు ఇవ్వండని ప్రభుత్వం చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనసాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రైవేటు వ్యక్తులను పట్టణంలు తిప్పుతూ ఎక్కడ కొత్త నిర్మాణాలు జరుగుతున్నాయో తెలుసుకుని వారి వద్ద నుండి అక్రమ వసూళ్లు చేయడం పరిపాటిగా మారిందినే ఆరోపణలు వస్తున్నాయి.

ఆ వార్డుల్లో అభివృద్ధి శూన్యం

పట్టణంలో 3, 4, 5 వార్డుల్లో సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేకమంది జీవనం కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులు, వీధి దీపాలు ఎంతో అవసరం అయినప్పటికీ ఈ ప్రాంతాలను వదిలేసి సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇతర ప్రాంతంలో చేస్తున్నారు. ఈ పాటికే రోడ్లు ఉన్నవాటిపై మళ్లీ రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి పేరిట పనులు చేపడుతున్నామని చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో వీధి దీపాలు సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. తాగునీరు సక్రమంగా సరఫరా కాదు. ఇటువంటి ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించి అభివృద్ధి చేయాల్సింది పోయి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే మరలా పనులు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వెన్నుపోటు, గొడ్డలిపోటు పేటెంట్ జగన్మోహన్‌రెడ్డిదే..

ప్రజాశక్తి - వేమూరు

కుంభకోణాల నుంచి ప్రజల దృష్టినీ మరలించడానికి ధర్నా డ్రామాలు ఆడుతున్నది జగన్ ముఠా అని, వెన్నుపోటు, గొడ్డలి పోటుకు పేటెంట్ జగన్మోహన్‌రెడ్డిదే నని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏడాదిలో కనీసం 10 శాతం హామీలు కూడా అమలు చేయనిది జగన్ ప్రభుత్వం అన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70శాతంపైగా హామీలు అమలు చేసినట్లు తెలిపారు. ఐదేళ్లలో 80శాతంపైగా హామీలు జగన్ సర్కార్ ఎగ్గొట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని రూ.లక్ష కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి, వైసిపిని స్థాపించాడని, శివకుమార్ స్థాపించిన వైసీపీని కబ్జా చేసి శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచాడని అన్నాడు. ఎత్తుకొని పెంచిన బాబాయిని చంపిన హంతకులు, కిరాతకులను కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. ఆస్తి కోసం తల్లినీ, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకు వెన్నుపోటు పొడిచాడని



మాట్లాడుతున్న శాసన సభ్యులు ఆనందబాబు

అన్నాడు. ఐదేళ్లలో 85శాతం హామీలు ఎగ్గొట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని అన్నారు. మద్యపాన నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పి, విషపూరితమైన మద్యం పోసి పేదల ఆరోగ్యానికి వెన్నుపోటు పొడిచాడని అన్నాడు. అన్న క్యాంటీన్ రద్దుచేసి పేదలు, కార్మికులకు వెన్నుపోటు పొడిచాందిని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాదని అగ్రహారం వ్యక్తం చేశారు. మొదటి నెలలోనే రూ.4వేల పెన్షన్‌ను తాము అమలు చేశామని చెప్పారు. నెలకు రూ.2,720 కోట్లు, సంవత్సరానికి పెన్షన్ కొరకు రూ.34వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నామని అన్నారు. అధికారంకు రాగానే రోడ్లపైన ఉన్న గుంటలు పూడ్చే కార్యక్రమం చేపట్టామని, ఇప్పటికీ రూ.1200 కోట్లు ఖర్చు చేసి 20వేల కిలోమీటర్లు రోడ్లు బాగు చేశామని అన్నారు. మళ్లీ వర్షాలు వచ్చాయని, రోడ్లు బాగు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ధాన్యం రైతులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను రూ.1674 కోట్లు రిలీజ్ చేశామని చెప్పారు. తమ ప్రభుత్వంలో పంచాయతీలకు రూ.990 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. రూ.4,500 కోట్లతో 30వేలపైన పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2025- 26 బడ్జెట్లో బీసీలకు రూ.47,456 కోట్లు కేటాయించామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి సమపాలనలో చేస్తున్న చంద్రబాబును అసలైన వెన్నుపోటు దారుడు జగన్మోహన్‌రెడ్డి వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయటం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

తెల్లవారు జామున గుర్తు తెలియని మహిళను భారీ వాహనం ఢీకొనడంతో పాటు అర కిలోమీటర్ దూరం ఈడ్చుకుంటూ వెళ్లడంతో మహిళ శరీర భాగాలు చిద్రమైన సంఘటన బుధవారం తెల్లవారు జామున చెరుకుపల్లిలో జరిగింది. యాచకురాలుగా అనుమానించదగిన మహిళను ఒక భారీ వాహనం ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్ళగా ఆ మహిళ శరీరం తీవ్రంగా ఛిద్రమై భయానకంగా మారింది. తెల్లవారాక గమనించిన చెరుకుపల్లి పోలీసులు మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళా మృత దేహం చల్లా చెదురయ్యి పందులు పీక్కుతింటూ ఉండటం స్థానికులు గమనించి వాటిని తరిమి వేశారు. మృతి చెందిన మహిళ గ్రామంలో యాచకురాలిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్ఐ టి అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యాన్సీ స్టోర్ దగ్ధం

ప్రజాశక్తి - మేదరమెట్ల

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యాన్సీ స్టోర్ దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం ప్రొద్దుపోయిన తరువాత సుమారు 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రాధాకృష్ణ ఫ్యాన్సీ స్టోర్ అగ్నికి ఆహుతైంది. షాపు యజమాని పులి వాసు బాబు మాట్లాడుతూ రాత్రి 10 గంటల వరకు షాపులోనే ఉన్నామని, నిన్ననే రూ.5 లక్షల విలువచేసే సరుకు కొన్నానని తెలిపారు. సుమారు రూ.35 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. స్థానిక ఎస్ఐ అహ్మద్ రఫీ సంఘటనపై కేసు నమోదు చేసుకుని ఎలా జరిగిందనే అంశం మీద అనేక కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



దగ్ధమవుతున్న ఫ్యాన్సీస్టోర్ దుకాణం

రూ.1.82 కోట్లు గోల్‌మాల్ చేసిన కార్యదర్శులపై వేటు

- భట్టిప్రోలు పంచాయలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ పూర్తి
- విచారణ నివేదికల ఆధారంగా నలుగురు కార్యదర్శులపై చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతీలో అక్రమ బిల్లులతో సుమారు రూ.1.82 కోట్లు నిధులు గోల్మాల్ జరిగిన ఘటనలో నలుగురు కార్యదర్శులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు పడింది. 2019 నుండి 24 మధ్య గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఆనాటి ముఖ్య నాయకులతో కుమ్మక్కై పంచాయతీ కార్యదర్శులు రూ.కోట్ల నిధులు స్వాహాకు పాల్పడ్డారని అందిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వం విచారణ చేపట్టింది. దివంగత డిఎల్‌పిఒ నరసింహారావు ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీ రికార్డులను స్వాధీన చేసుకొని సుమారు ఐదు నెలల పాటు వాటిని అంచె లంచెలుగా టీంలుగా ఏర్పాటు చేసి విచారణ జరిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు బృందాలు జరిపిన విచారణలో కార్యదర్శులు నిధుల వినియోగం బిల్లులు చెల్లింపుకు జరిగిన రసీదులు సక్రమంగా లేకుండా రూ.1.82 కోట్లు దుర్వినియోగమైనట్లు బృందం సభ్యులు తేల్చారు. ఈ విచారణ పూర్తి సారాంశాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్‌కు నివేదించారు. వేదికను



భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం

పరిశీలించిన అధికారులు నిధుల స్వాహాకు కారకులైన అప్పటి భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శులు తెనాలి వెంకటేశ్వర్లు, కోటా శ్రీనివాసరావు, బోరుగడ్డ సతీష్, ఎస్ రాజశేఖరరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందించారు. అదే సమయంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేసిన రాఘవయ్య, మౌనిష ను కూడా సస్పెండ్ చేయాలని కమిషనర్ నుండి డిపిఓకు ఆదేశాలు రాగా బుధవారం జూనియర్ అసిస్టెంట్లు ఇరువురిని సస్పెండ్ చేస్తూ డిపిఒ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండుకు గురైన కార్యదర్శులు తెనాలి వెంకటేశ్వర్లు ప్రస్తుతం చెరుకుపల్లి మండలం కనగాల పంచాయతీ కార్యదర్శిగాను, కోట శ్రీనివాసరావు భట్టిప్రోలు కార్యదర్శి గాను, సతీష్ బాబు ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ఈఓపిఆర్డిగాను, శేఖరరెడ్డి నగరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వీరి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుండి అమల్లో ఉంటాయని డిపిఓ రమేష్ తెలిపారు.

సర్పంచిపై కూడా తప్పని వేటు?

భట్టిప్రోలు పంచాయతీలో దుర్వినియోగం జరిగిన రూ.కోట్ల నిధుల్లో కార్యదర్శులతో పాటు సర్పంచ్‌పై కూడా చర్యలు చేపట్టాలని కమిషనర్ నుండి డిపిఓకు ఆదేశాలు అందాయి. నిధుల గోల్మాల్ వ్యవహారంలో అనాటి అధికార వైసిపి పెద్దల మాటలు విని ప్రభుత్వ ఉద్యోగులు బలయ్యారని, దీనిలో వారు మాత్రమే కాకుండా సర్పంచి పాత్ర కూడా ఏమేరకు ఉందో సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సర్పంచిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు టిపిఓ రమేష్ తెలిపారు. మరి కొద్ది రోజుల్లో మరో సారి రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి సర్పంచి పాత్ర వెలికి తీసి నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

మెగా డీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - బాపట్ల

మెగా డీఎస్సీ 2025కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిఇఓ పురుషోత్తం తెలిపారు. డీఎస్సీ పరీక్ష కేంద్రాలు, ఇతర ఏర్పాట్లపై ఆయన బుధవారం వివరాలు తెలిపారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, చీరాల సెయింట్ ఆన్స ఇంజనీర్ కాలేజి అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6 నుండి 29 వరకు ఉదయం 9-30 నుండి 12-00 వరకు, మధ్యాహ్నం 2-30 నుండి 5-00 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దానికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్, హెల్ప్ డెస్క్, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశామని అన్నారు. అవసరమైన వారికి వ్రాసే వారిని సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం, మధ్యాహ్నం హాల్ టికెట్లతో నిర్ణీత సమయం ప్రకారం గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్ష వ్రాయాలని అభ్యర్థులకు సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షలకు అనుమతించడం జరగదని చెప్పారు.


మాట్లాడుతున్న డిఎస్పి రామాంజనేయులు

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

బక్రీద్ పండుగ సందర్భంగా ఏ సామాజిక వర్గం వారైనా ఆవులు, దూడలను వధించరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను వధించరాదని, వ్యవసాయానికి పనికిరాని జంతువులను పశు వైద్యుల ధ్రువీకరణ పత్రం పొంది వధించుకోవచ్చని తెలిపారు. పట్టణాల్లో పురపాలక సంఘ అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు తెలిపిన ప్రాంతాల్లో మాత్రమే వ్యవసాయానికి పనికిరాని జంతువులను వధించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అన్ని ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బక్రీద్ పండగను ప్రశాంతమైన వాతావరణంలో ముస్లిం సోదరులు జరుపుకోవాలని తెలిపారు. ఈద్గాలు, మసీదుల వద్ద పరిశుభ్రత చేపడుతున్నట్లు వివరించారు.

ఏడాది పాలనలో ఒరిగిందేమీ లేదు

- 'వెన్నుపోటు' నిరసన ర్యాలీలో మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి



నిరసన ర్యాలీలో కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల

'వెన్నుపోటు దినం' నిరసన పట్టణంలో బుధవారం నిర్వహించారు. పట్టణంలో వైసిపి కార్యాలయం నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలి నిర్వహించారు. వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య గుండు చేయించుకుని తన నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారు సలీమాకు ఏడాది కూటమి పాలన విఫలమైందని పేర్కొంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సభాపతి కోన రఘుపతి మాట్లాడుతూ సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. చంద్రబాబును చూసి కాదు పవన్ కళ్యాణ్‌ను చూసి ఓట్లు వేశామన్న ప్రజలు మోసపోయామంటున్నారని అన్నారు. అయితే పవన్ కళ్యాణ్ సూట్ కేసులు మోసుకెళ్ళడమే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎంపీపీ రామరాజు, కోకి రాఘవరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ డి సీతారామిరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, సయ్యద్ పీర్, వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క వీరారెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య పాల్గొన్నారు.

పర్చూరు : గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైసీపీ ఇంచార్జి గాదె మధుసూదనరెడ్డి కోరారు. ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా హామీలు అమలు చేయకుండా మోసం చేశారంటూ 'వెన్నుపోటు' నినాదంతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. హామీలు అమలు చేయాలని వైసిపి కార్యకర్తలు బొమ్మల సెంటర్‌లో నినాదాలు చేశారు. మార్కెట్ యార్డు నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు సుధారాణికి వినతి పత్రం అందించారు.

వైసిపి మండల కన్వీనర్లు కొల్లా వెంకట్రావు, భవనం శ్రీనివాసరెడ్డి, పల్లెపోగు రాంబాబు, గాజుల రమేష్, గేరా స్వరాజ్ కుమార్, జూపూడి రోశయ్య, కూరాకుల ఇస్సాకు, ముప్పాళ్ళ రాఘవయ్య పాల్గొన్నారు.

రేపల్లె : కూటమి ప్రభుత్వం నయవంచన ప్రభుత్వమని సాక్షాత్తూ ప్రజలే మండిపడుతున్నారని వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. ప్రభుత్వ పగ్గాలు చేపట్టి ఏడాదైనప్పటికి ప్రజలకు చేసిందేమీలేదని వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినోత్సవంలో భాగంగా పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్సీ, వైసీపీ బాపట్ల పార్లమెంటరీ ఇన్‌ఛార్జి తూమాటి మాధవరావు, వైసీపీ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రాంబాబు, చదలవాడ శ్రీనివా సరావు, వీసం నాగలక్ష్మి, చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, బొర్రా శ్రీనివాసరావు, పట్టెం శ్రీనివాసరావు, సముద్రాల ప్రభు కిరణ్, నిజాంపట్నం కోటేశ్వరరావు, సబ్జా పద్మావతి, శారద పాల్గొన్నారు.

కొల్లూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. బుధవారం వెన్నుపోటు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ర్యాలీని కొల్లూరు వెల్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో అశోకు బాబు వాగ్వివాదానికి దిగారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి పద్మారావు, వైసీపీ మండల అధ్యక్షులు సుగ్గున మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాల : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైసిపి నాయకులు ఆరోపించారు. వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్లో డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిరసన ర్యాలీ తహశీల్దారు కార్యాలయం వరకు నిర్వహించారు. వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు యాతం మేరీ బాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.


కొల్లూరులో పోలీసులతో వరికూటి అశోక్‌బాబు


రేపల్లె తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

17న మండల సామాజిక తనిఖీ వేదిక

ప్రజాశక్తి - కర్లపాలెం

ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ఈనెల 5నుండి 14వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో సామాజిక బృందాలు తనిఖీ చేస్తారని ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 17న ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో మండల సామాజిక తనిఖీ వేదిక జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ కె శ్యామ్, ఎస్ఆర్పి తులసి నాయక్, ఎఈ పి రమేష్, ఎఒ రజిని, జిఆర్పిలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



యోగ పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

మండల స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ఎమ్మార్సీ సమావేశం హాల్లో మండల స్థాయి యోగ పోటీలు నిర్వహించినట్లు ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ప్రాధాన్యతను గుర్తించి క్రమం తప్పకుండా ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. 10 నుండి 18 ఏళ్లలోపు వారికి, 18 నుండి 35 ఏళ్ల వయసు వారికి యోగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో గెలిచిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డి కె సత్యనారాయణ, యోగ మాస్టర్ ట్రైనర్, ఉప్పుటూరు, నూతలపాడు హెూమియోపతి డాక్టర్లు డి చంద్రశేఖర్, డాక్టర్ బి శ్రీనివాసరావు, విఆర్ఓ వై శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు, కటారి సత్యం పాల్గొన్నారు.


రూ.2లక్షల విలువైన చెక్కు అందజేస్తున్న దృశ్యం

జీవనజ్యోతి బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - బల్లికురవ

అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి జీవనజ్యోతి బీమా యోజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రూ.2లక్షల విలువైన చెక్కును ఆ కుటుంబానికి ఆ బ్యాంకు చీఫ్ మేనేజర్ శీను నాయక్ బుధవారం అందజేశారు. మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీను ఆనారోగ్యంతో ఇటీవలమృతి చెందారు. తన్నీరు శ్రీను బల్లికురవ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజనలో చేరి వున్నారు. ఈ పథకం ద్వారా ఆయన నామినీ అయిన భార్య తన్నీరు శాంతకు రూ.2లక్షల భీమా మంజూరైంది. మృతుడి భార్య శాంతకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా భీమా పథకాల్లో నమోదు కావాలని అన్నారు. కార్యక్రమంలో మేనేజరు సిహెచ్ రవీంద్ర బాబు, అసిస్టెంట్ మేనేజర్లు సుహితా గ్రేస్, కుమారి బిందు మాధవి పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఎవరిష్టం వారిదే..

నిబంధనలకు పాతరేసి అనుకూలురుకే ప్రయోజనం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో విద్యాశాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు నిబంధనలకు పాతర వేసి తమకు అనుకూలురైన ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సాంకేతిక వ్యవస్థలో వచ్చిన పొరపాట్లు సరిచేసే ప్రక్రియను తమకు అనుకూలంగా మలచుకుంటున్నట్లు ఉపాధ్యాయులు పలువురు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు మండలం, అమలనాధునివారిపాలెం ఎంపిపిఎస్ ఎలిమెంటరీ పాఠశాలలో నలుగురు ఎస్ జిటి లు, ఒక ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ ఉన్నారు. ఇక్కడ ప్రిఫరెన్షియల్ కోటాలో ఇద్దరు ఎస్ జిటిలు పనిచేస్తుండగా ఇక్కడ ఇదే కోటాలో మరొకరికి అవకాశం కల్పిస్తూ స్థానిక విద్యాశాఖ అధికారులు వెసులుబాటు కల్పించినట్లు విమర్శలు ఉన్నాయి. ప్రిఫరెన్షియల్ కోటా లో 40 శాతం అనగా అక్కడ ఇద్దరుకు మాత్రమే అవకాశం ఉంటే మరొకరికి అవకాశం కల్పించడం విమర్శలకు దారి తీస్తుంది. ఉపాధ్యాయుల సీనియారిటీని లెక్కించే విషయంలో కూడా కొందరు ఎంఇఒలు నిబంధనలు అతిక్రమించి తమకు అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులకు అదనపు పాయింట్లు వేసినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కేటగిరి 1 పాఠశాలలో 8 సంవత్సరాలు పని చేసిన వారికి 8, కేటగిరి2 పాఠశాలలో 8 సంవత్సరాలు పని చేసిన వారికి 16, కేటగిరి 3పాఠశాలలో 8 సంవత్సరాలు పని చేసిన వారికి 24 పాయింట్లు కు మించి ఇవ్వకూడదు. అయితే రీ అపోర్షన్ ఉపాధ్యాయులకు 30 పాయింట్లు పై బడి వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా లో ఒంగోలు, దర్శి, ముండ్లమూరు, అద్దంకి మండలాల్లో ఇటువంటి అక్రమాలు చోటు చేసుకున్నట్లు విద్యాశాఖకు మౌకిక ఫిర్యాదులు అందాయి. ఇదిలా ఉండగా 2008 డిఎస్సీ ఉపాధ్యాయులకు సంబందించి 2017, 2023 సంవత్సరాలలోరెండు దఫలు బదిలీ అయ్యారు. కాగా 2025 బదిలీ సీనియరిటీ లో కమిషనరేట్ ద్వంద్వ విధానం అమలు చేస్తుంది. వీరిలో కంపల్సరీ బదిలీ అయి, 7సంవత్సరాల 10 నెలలు సర్వీస్ పూర్తి చేసిన వారికి 23.41 పాయింట్లు, 7 సంవత్సరాల 6 నెలలు సర్వీస్ పూర్తి చేసిన వారికి 24పాయింట్లు కేటాయించడం పట్ల సీనియర్ అధ్యాపకులు మండిపడుతున్నారు.

కాగా కమిషనరేట్‌లో సీనియరిటీ జాబితా రూపొందించే ప్రక్రియ లో పాటించ వలసిన నియమ నిభంధనలు కూడా పాటించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. జిఒ 22 లోని 11 అంశం ప్రకారం ఒకే కేడర్ సీనియరిటీ పరిగణలోకి తీసుకునేటప్పుడు ఇద్దరు వ్యక్తులు సమానం కేడర్ అయితే వారిలో సీనియర్ ను పరిగణలోకి తీసుకోవాలి. అవి కూడా సమానం అయితే పుట్టినతేది ప్రకారం సీనియరిటీ పరిగణలోకి తీసుకోవాలి. అవీ సమానం అయితే స్త్రీ, పురుషులు పరిగణలోకి తీసుకోవాలి. అయితే కమిషనరేట్ కేవలం పుట్టిన తేది మాత్రమే పరిగణలోకి తీసుకుని సీనియారిటీ జాబితా రూపొందించినట్లు ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇదిలా ఉండగా ప్రిఫెరెన్షియల్ కోటా లో ఎస్‌జిటిలో 40 శాతం, స్కూల్ అసిస్టెంట్ విషయంలో 50 శాతం మించకూడదనే నిభందనలు పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏ ఉపాధ్యాయుడయినా స్పౌజ్ లేదా ప్రిఫెరెన్షియల్ కోటా మాత్రమే వినియోగించు కోవలసి ఉం డగా కొందరు ఎంఇఒలను మేనేజ్ చేసి రెండూ ఉపయోగించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. కమిషనరేట్ లో జరుగుతున్న లోపాలు సరిచేసి, మండలాల పరిధిలో జరుగుతున్న అవకతవకలు సరి చేసి బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని పలువురు టీచర్లు కోరుతున్నారు.

2251 బేళ్ల తిరస్కరణ

పొగాకు మార్కెట్‌లో మారని వ్యాపారుల తీరు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పొగాకు మార్కెట్‌లో అదే తీరు కొనసాగుతోంది. వ్యాపారుల్లో ఎటువంటి మార్పు లేదు. ధరలు పెరగకపోగా సంక్షోభానికి మరింత ఆజ్యం పోస్తున్నారు. రైతులు రోడ్లెక్కేలా చేస్తున్నారు. పాలకుల మాటలను వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారా? లేక వారిపై సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారా? అనేదీ రైతులు ఆలోచించాలి.బుధవారంనాడు 11 వేలం కేంద్రాల పరిధిలో 2251 బేళ్లను తిరస్కరిం చారు. పలు రకాల కారణాలతో వాటిని కొనకుండా ఇంటికి పంపారు. 7291 బేళ్లు రాగా 5040 బేళ్లను కొన్నారు. గరిష్ఠ ధరలో మార్పు లేదు. కిలో రూ.280 ఉండగా గరిష్ట ధర రూ 185 ఉంది. సగటు ధర నల్లరేగడినేలల్లో రూ.252.32 ఉండగాతేలిక నేలల్లో రూ.254.41 ఉంది. మరోవైపు బర్లీ పొగాకు కొనుగోళ్లలోనూ పురోగతి లేదు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట

రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒంగోలు రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపి కార్యాలయంలో బుధవారం ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఎంపీ మాగుంట అభిమానులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డిని సత్కరించి కేకును కోసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, తాతా ప్రసాద్, అయినాబత్తిన ఘనశ్యాం, బెల్లం సత్యనారాయణ, కుప్పా రంగ నాయకులు, పమ్మి భద్రిరెడ్డి, పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండే శ్రీనివాసులు, షేక్ కరిముల్లా, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

పకడ్బందీగా డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



డిఎంహెచ్‌ఒతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఎపి డిఎస్‌సి 2025 పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం డిఎస్‌సి పరీక్షల నిర్వహణపై వివిద శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎపి డిఎస్‌సి పరీక్షలు జిల్లాలో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. ఒంగోలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.శివ కుమార్ మొబైల్ ఫోన్ నెంబర్ 8125264606ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ బి.చిన ఓబులేసు, డిఇఒ ఏ.కిరణ్‌కుమార్, డిపిఒ జి.వెంకట నాయుడు, డిఎంహెచ్ఒ వెంకటేశ్వర్లు, డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అనాథ శిశువుల దత్తత ప్రక్రియ చట్టబద్ధంగా నిర్వహించాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అనాథ శిశువుల దత్తత ప్రక్రియ చట్టబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. అనాథ శిశువులను దత్తతతో తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని కలెక్టర్ చెప్పారు. చెత్త కుండీల వద్ద, ఆస్పత్రులు, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద వదిలేసిన శిశువులు మహిళ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే శిశు గృహ, బాల సుధన్ లలో ఆశ్రయం పొందుతున్నారని చెప్పారు. అలాంటి శిశువులు, బాలలు ఏడుగురు ప్రభుత్వ సంరక్షణలోని శిశు గృహంలో ఉన్నారన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత శిశు గృహకు వచ్చిన వారందరికీ తల్లిదండ్రుల ప్రేమ అందించాలన్నారు. మొదటి సారిగా బాపట్ల జిల్లా నుంచి దత్తతు ఇవ్వడానికి అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కారా (చైల్డ్ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) ద్వారా ఈ ప్రక్రియ జరగనుందన్నారు. చట్ట ప్రకారం దత్తతు ప్రక్రియతోనే తల్లిదండ్రులను వారికి జత చేయగలమన్నారు. ప్రస్తుతం ఇరువురికి దత్తత ఇవ్వడానికి జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. నిబంధనలను అనుసరించి బాలిక లావణ్య, బాలుడు కార్తీక్‌లకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఎస్పీ తుషార్ డూడికి ఫోన్లోనే కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఇందుకు సంబంధించిన విచారణ నివేదికను వేగంగా పంపాలని చెప్పారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జువెనైల్ వెల్ఫేర్ కమిటీ ప్రొభిషన్ అధికారి సౌందర్య, ఐ సి పి ఎస్ డిసిపిఓ పురుషోత్తమరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు జాతీయ స్థాయిలో రజత పతకం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



అభినందిస్తున్న ఎస్‌పి

జాతీయస్థాయి పెన్‌కాక్ సిలాట్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో బాపట్ల జిల్లాకు చెందిన కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను రజత పతకం సాధించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన కర్లపాలెం పోలీస్ కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను ఎస్పీ తుషార్‌డూడి బుధవారం అభినందించారు. 2025 మే 9 నుండి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరంలో కేడి సింగ్ బాబు స్టేడియంలో జరిగిన 13వ జాతీయ స్థాయి పెన్ కాక్ సిలాట్ చాంపియన్ షిప్‌లో వీరంకి నరేంద్ర సత్తా చాటి రజత పతకం గెలుపొందిన నేపథ్యంలో ఎస్పీని పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశాడు. ఎస్పీ అతడిని అభినందించి మెడల్ తో సత్కరించారు.

బలహీనవర్గాల..

కుటుంబాల స్థితిగతులపై అధ్యయనం చేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-మార్కాపురం



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

క్షేత్ర స్థాయిలో బలహీన వర్గాల పిల్లల (వనరబుల్ చిల్డ్రెన్) కుటుంబ స్థితిగతులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. ఆ విధంగా వివరాలు సేకరించిన తరువాత వారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించవచ్చని, ఆయా కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం మెప్మా కార్యాలయంలో బలహీన వర్గాల పిల్లల (వనరబుల్ చిల్డ్రెన్) కుటుంబ స్థితిగతులపై అధ్యనం చేసేందుకు రూపొందించిన యాప్‌పై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద రాచర్ల మండలాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, జిల్లా మహిళా, శిశు సంరక్షణ అధికారిణి హేన సుజన్, డిసిపిఓ దినేష్ కుమార్, బంగారు బాల్యం నోడల్ అధికారి గిరిధర్ శర్మ, సార్డ్స్ ప్రతినిధి సునీల్, ఐసిడీస్ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మార్కాపురం పట్టణంలోని 12వ వార్డులో గల సచివాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా వెంట జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, మునిసిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ, తహసిల్దార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.